
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 29 అక్టోబరు 2024



డీఆర్వో బాధ్యతల స్వీకరణ


డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన విజయసారథి

పుట్టపర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా విజయసారథి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో ఏపీఐఐసీలో ఓఎస్డీగా పనిచేస్తున్న ఈయన బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డీఆర్వో కొండయ్య విజయవాడలోని జీపీడీలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. బాధ్యతలు స్వీకరించిన డీఆర్వో విజయసారథి.. కలెక్టర్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

టీడీపీ సభ్యత్వంతో భరోసా: మంత్రి సవిత


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు.. సభ్యత్వం తీసుకుంటే భరోసా దక్కుతుందని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రూ.వందతో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ప్రమాదం జరిగితే ఆ కుటుంబాన్ని ఆదుకునే అవకాశం ఉందన్నారు. సభ్యత్వ నమోదు తప్పక చేయించుకోవాలని మంత్రి కోరారు.

అక్రమ లేఅవుట్లను అనుమతించేది లేదు

గోరంట్ల మండలంలో గత వైసీపీ పాలనలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వెలిశాయని మంత్రి సవిత పేర్కొన్నారు. వాటిని ఎట్టి పరిస్థితిల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి: ఎస్పీ


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీసు సిబ్బందితోపాటు యువత, విద్యార్థులు, రైతులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు 250 మందిదాకా రక్తదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎస్పీ రత్న మాట్లాడుతూ.. రక్తదానం చేయడానికి పెద్దఎత్తున ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పంటనష్టం నివేదికలు పంపండి: కలెక్టర్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా జిల్లాలో వాటిల్లిన పంట నష్టంపై నివేదికలు పంపాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్.. ఫిర్యాదులు స్వీకరించారు. 201 అర్జీలు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ శాఖల అధ్వర్యంలో పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి పంపాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత పాల్గొన్నారు.

డీపీఓలో 45..

పుట్టపర్తి రూరల్(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ రత్న అర్జీలు స్వీకరించారు. 45 ఫిర్యాదులు అందాయి. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులను పరిశీలించి చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత ఆశలపై నీళ్లు..!

- టమోటా పైర్లపై వరుస వర్షాల దెబ్బ
- కాయలపై ఏర్పడిన మచ్చలు
- తోటలోనే కుళ్లిపోయిన వైనం..
- తగ్గిన దిగుబడి
- ధర బాగున్నా.. రైతుకు తప్పని నష్టాలు


మచ్చకాయలను వేరుచేస్తున్న కూలీలు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో టమోటా ధరలు కొన్ని రోజులుగా ఆశాజనకంగా ఉన్నాయి. 15 కిలోల బాక్సు రూ.500 వరకు పలుకుతోంది. పంట సాగుచేసిన రైతులు ఆనందంలో ఉండిపోయారు. త్వరలోనే పంట కోసి, అమ్ముకుని, అప్పుల నుంచి బయటపడదామని ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలపై గత వారంలో కురిసిన ఎడతెరపిలేని వర్షం నీళ్లు కుమ్మరించింది. వరుస వర్షాలకు టమోటా పంటను మచ్చ తెగులు ఆశించింది. కాయలపై భారీగా మచ్చలు ఏర్పడ్డాయి. మొదలులో కూడా మచ్చలు వచ్చాయి. మచ్చలున్న కాయలను రైతులు పడేయాల్సి వస్తోంది. ఇలా చాలా కాయలను రైతులు తోటలోనే తొలగించి, పడేశారు. తద్వారా దిగుబడి దారుణంగా పడిపోయింది. అంతో ఇంతో దిగుబడి వచ్చినా.. మచ్చ సోకిన టమోటా కాయలను మార్కెట్‌లో కొనేవారు లేరు. నాణ్యమైన కాయలు 15 కిలోల బాక్సు రూ.500 వరకు పలుకుతుంటే.. మచ్చకాయలు మాత్రం రూ.వందకి అమ్ముడుపోవడం కూడా కష్టంగా మారింది. దీంతో లాభాలు వస్తాయనుకుంటే వర్షం కారణంగా నష్టాలు మిగిలాయని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట తెగుళ్లతో నోటికి అందకుండా పోయిందని వాపోతున్నారు.

అదుపులోకి రాని తెగులు

మండల వ్యాప్తంగా దాదాపు 130 హెక్టార్లలో రైతులు టమోటా సాగుచేశారు. అప్పోసప్పో చేసి పంట పెట్టారు. సేద్యంతోపాటు, కట్టెలు, ఎరువులు, రసాయన మందులు, కూలీల ఖర్చులు పెరిగిపోయాయి. అవన్నీ భరించి పంట పెట్టారు. కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటకు మచ్చ తెగులు సోకింది. మందులు పిచికారీ చేసినా తెగులు అదుపులోకి రాలేదు. దీంతో రసాయన మందుల ఖర్చు అదనంగా పడింది.

వర్షంతో పంటకు దెబ్బ



ఇటీవల కురిసిన వర్షాలకు టమోటా కాయలు దెబ్బతినడంతోపాటు మొదలు కూడా కుళ్లిపోయింది. ఎక్కువశాతం కాయలకు మచ్చలు సోకాయి. దీంతో 15 కేజీల బాక్సు రూ.వందకు కూడా అమ్ముడవడం లేదు.

- కొత్త బయపరెడ్డి, మామిళ్లకుంట్లపల్లి

కొనేవారు కరువు



రూ.లక్షలు పెట్టుబడి పెట్టి టమోటా సాగుచేసినా ఫలితం లేకపోయింది. దిగుబడి బాగా వచ్చినా.. కాయలు కుళ్లిపోవడం, మచ్చలు రావడంతో మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు కరువయ్యారు. దీంతో అడిగిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

-మోహన్‌రెడ్డి, రైతు, ఓబుళదేవరచెరువు

మందులు పిచికారీ చేయాలి

అధిక వర్షాలకు మచ్చ తెగులు సోకుతుంది. ఇది సోకకుండా ముందు జాగ్రత్తగా 2.5 గ్రాముల ఎం45 లేదా ఒక గ్రాము కార్బండజైమ్ లీటరు నీటికి కలిపి, పంటపై పిచికారీ చేసుకోవాలి. కాయమచ్చ, కాండంమచ్చ తెగులు నివారణకు ఒక మిల్లీలీటరు ఆజాక్సిస్ట్రోబిన్ లేదా ఫోలికర్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఊజీ నివారణకు 0.3 మిల్లీలీటర్ల స్పైనోసాడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

-లావణ్య, ఉద్యాన శాఖాధికారి

బుక్కపట్నం విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బుక్కపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్‌లో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏకంగా రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలో ఈనెల 26న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బుక్కపట్నం విద్యార్థులు సత్తాచాటారు. 89 కేజీల విభాగంలో గణేష్‌రెడ్డి, 81 కేజీల విభాగంలో ముక్తియార్, అండర్-19 పవర్ లిఫ్టింగ్ 68 కేజీల విభాగంలో మంజునాథ్, 50 కేజీల విభాగంలో మోహన్‌కృష్ణ విజేతలుగా నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్ సోమవారం తెలిపారు. విద్యార్థులు నవంబరు 2న తెనాలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

టపాసులతో ఆటలు వద్దు..!



దీపావళి అంటే ఇంటిల్లిపాదికీ అమితాసక్తి. టపాసులు కాల్చుతూ ఆనందంగా చేసుకుంటారు. ఇందులో ఏమాత్రం అజాగ్రత్త వహించినా.. పండుగ పూట విషాదాలు తప్పవని అగ్నిమాపక అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. టపాసులు విక్రయించేటపుడు, కాల్చేటపుడు జాగ్రత్తలు పాటిస్తేనే పండుగ ఆనందంగా సాగుతుందని వారు సూచిస్తున్నారు. (వివరాలు 7వ పేజీలో..)

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలి

తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థినుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

మడకశిర టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. మడకశిర తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం బైఠాయించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్ ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్, కాస్మెటిక్ చార్జీలు రూ.3వేలకు పెంచాలన్నారు. జూనియర్ కళాశాల హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. వర్షం వస్తే నీరు నిలిచి, విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్.. విద్యార్థి సంఘం నాయకులతో కలిసి హాస్టల్‌ను పరిశీలించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్


దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేయనున్నట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. అందుకు సంబంధించి ప్రత్యేక రిజిస్ట్రేషన్లు ప్రారంభించామన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలో మూడు రోజుల స్ర్కీనింగ్‌క్యాంప్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. దివ్యాంగజన్ సేవ పేరిట 200 మందికి కృత్రిమ అవయవాలను త్వరలో అందిస్తామన్నారు. మొదట అవసరమైన వారి వివరాలు తీసుకుని, అవయవాలు సిద్ధం చేసిన తరువాత పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ సమన్వయకర్త కోటేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

వాన దెబ్బ



బొమ్మనహాళ్ మండలంలో మొక్కజొన్న పంటను ఇటీవల ముంచెత్తిన వరద నీరు

జిల్లావ్యాప్తంగా గత వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం తీవ్రంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 591.38 హెక్టార్లలో రూ.3.96 కోట్ల పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపారు. క్షేత్ర స్థాయిలో లోతుగా పరిశీలిస్తే పంటనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోతకొచ్చిన మిరప, పత్తి, ఇతర రకాల పంటలు భారీ వర్షానికి దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

- అనంతపురం అర్బన్/పామిడి/బొమ్మనహాళ్ (ఆంధ్రజ్యోతి)

- భారీ వర్షానికి తీవ్ర పంటనష్టం
- ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికలు
- 591.38 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు
- నష్టపరిహారం కోసం అన్నదాతల వేడుకోలు

134.46 హెక్టార్లలో ఉద్యాన పంటల నష్టం

భారీ వర్షాలకు జిల్లాలోని 15 మండలాల్లో 119 మంది రైతులకు చెందిన 134.46 హెక్టార్లల్లో రూ.1.30 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి.హీరేహాళ్, బుక్కరాయసముద్రం, కూడేరు, పామిడి, కంబదూరు, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు, నార్పల, బెళుగుప్ప మండలాల్లో మిరప, టమోటా, వంకాయ, దానిమ్మ, కాకర, చీనీ, కర్బూజ, ద్రాక్ష, అరటి, మామిడి, ఉసిరి, బీర పంటలు దెబ్బతిన్నాయి.



పామిడి మండలంలో వానకు తడిసిన పత్తిని ఆరబెట్టిన రైతులు

వ్యవసాయశాఖలో రూ. 2.66 కోట్ల పంటనష్టం

వ్యవసాయ శాఖ పరంగా జిల్లాలోని 14 మండలాల్లో 481 మంది రైతులకు చెందిన 456.92 హెక్టార్లల్లో రూ.2.66 కోట్ల పంట నష్టం జరిగింది. అనంతపురం, గార్లదిన్నె, కణేకల్లు, నార్పల, గుమ్మగట్ట, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, కూడేరు, శింగనమల, పెద్దవడుగూరు మండలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.



దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

మిరప దెబ్బతింది



ఏడెకరాల్లో ఎండు మిరప పంట సాగు చేశా. ఇందులో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని పంట పెట్టా. మరో ఎకరాలో పచ్చిమిరప సాగు చేశా. ఎండు మిరప పంట కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షం రావడంతో పూర్తిగా దెబ్బతింది. చెట్లపై ఎండు మిరప కాయలు బూజుపట్టి కుళ్లిపోతున్నాయి. తద్వారా రూ.5 లక్షలకుపైగా నష్టం వచ్చింది. పచ్చి మిరప కోత దశలో ఉన్నప్పుడు వర్షం పడటంతో పూర్తిగా దెబ్బతింది.

- విజయభాస్కర్‌రెడ్డి, అనుంపల్లి, పామిడి మండలం

ఉద్యాన పంటల నష్టం వివరాలు...

పంట	విస్తీర్ణం (హెక్టార్లల్లో)	పంటనష్టం (లక్షల్లో)
మిరప	73.80	64.41
టమోటా	27.20	21.76
కాకర	0.80	0.48
ద్రాక్ష	2.00	4.00
చీనీ	8.40	9.64
అరటి	6.60	16.50
దానిమ్మ	2.00	2.40
ఉసిరి	2.00	1.60
మామిడి	4.00	4.00
కర్బూజ	6.00	4.80
వంకాయ	1.00	0.60
బీర కాయ	0.66	0.40
మొత్తం	134.46	రూ.1.30 కోట్లు

వ్యవసాయ శాఖ పరంగా పంటనష్టం వివరాలు

పంట రకం	విస్తీర్ణం (హెక్టార్లల్లో)	పంటనష్టం (లక్షల్లో)
వరి	273.1	156.65
పత్తి	11.0	5.48
మొక్కజొన్న	111.8	75.29
జొన్న	11.0	6.05
వేరుశనగ	48.0	22.26
నువ్వులు	2.0	0.3
మొత్తం	456.92	రూ.2.66 కోట్లు

పంట తడిసిపోయింది..



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. పంట మొదటి కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షం పడటంతో పత్తి దెబ్బతింది. వానకు పత్తి పంట పూర్తిగా తడిసిపోయింది. ఇప్పటి దాకా ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టా. వానకు తడిసిన పత్తిని వదిలేయలేక తొలగించి ఇంట్లో ఆరబెట్టుకున్నా. పత్తి రంగు మారడంతో వ్యాపారులు కొంటారో లేదో అర్థం కావడం లేదు. భారీ వర్షానికి పత్తి పంటను గులాబీ పురుగు ఎక్కువగా ఆశిస్తోంది. దీనికి మందులు పిచికారి చేయాలంటే అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిందే. వ్యవసాయ అధికారులు పత్తి పంట దెబ్బతిన్నట్లు రాసుకొని వెళ్లారు. పంటనష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

-రామలింగారెడ్డి, గజరాంపల్లి, పామిడి మండలం

పంటంతా మునిగిపోయింది



వరద నీటిలో పంటంతా మునిగిపోయింది. రెండు ఎకరాల్లో మొక్కజొన్న, మరో రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. కోతకువచ్చిన సమయంలో భారీ వర్షం రావడంతో వేదావతి, హగరి నది నుంచి వచ్చిన వరద నీరు మొక్కజొన్న, పత్తి పంటను ముంచేసింది. దీంతో మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాలుగు ఎకరాల్లో రెండు పంటల సాగు కోసం రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. ఇప్పటికే పంటల సాగు కోసం రూ.6 లక్షలు అప్పు చేశా. ఈ సారి పంట చేతికొచ్చి ఉంటే రూ.4లక్షలదాకా అప్పు తీరేది. వరదనీటితో పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

-ఆంజనేయులు, ఏలంజి, బొమ్మనహాళ్ మండలం

న్యూస్‌బాక్స్

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మలోల

అనంతపురం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ ఆఫీసర్(డీఆర్ఓ)గా మలోల బాధ్యతలు స్వీకరించారు. జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న మలోలను జిల్లా డీఆర్‌ఓగా ప్రభుత్వం నియమించింది. నూతన డీఆర్‌ఓ మలోల సోమవారం జిల్లాకు చేరుకున్నారు. ఉదయమే కలెక్టరు వినోద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రస్తుతం బదిలీ అయిన డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన డీఆర్‌ఓకు కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లు అభినందనలు తెలిపారు.

చెస్‌లో చిన్నారి ప్రతిభ

- ఒకే సమయంలో మూడు పతకాలు సాధించిన శమిక



సాధించిన పతకాలతో కాశి శమిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కాశి శమిక చెస్‌లో అద్భుత ప్రతిభ చూపి ఒకే సారి మూడు పతకాలు సొంతం చేసుకుంది. విజయవాడలో ఈనెల 22 నుంచి 27 వరకు బీఎన్‌కే ఫౌండేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్, అఖిల భారత చదరంగ సమాఖ్య, ప్రపంచ చదరంగ సమాఖ్య సంయుక్తంగా భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ ప్రథమ ఇంటర్నేషనల్ ఫిడే చెస్ ఫెస్టివల్-2024ను నిర్వహించారు. ఇందులో వివిధ దేశాల నుంచి సుమారు 1500మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి కాశి శమిక క్లాసికల్ అండర్-7 బాలికల విభాగంలో ఐదో స్థానం, ర్యాపిడ్‌లో నాలుగో స్థానం, బ్లిట్జ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. ఒకే సమయంలో మూడు పతకాలు సాధించిన క్రీడాకారిణి శమికను కోచ్‌లు ఉదయ్‌కుమార్ నాయుడు, గోవింద రాజులు అభినందించారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.13పలికినట్లు ఆయన తెలిపారు.

భారీగా టపాసుల స్వాధీనం



ఐషర్ వాహనంలోకి లోడ్ చేస్తున్న టపాసులు

యల్లనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా భారీమొత్తంలో నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ సత్యబాబు, ఎస్ఐ రాంప్రసాద్ సోమవారం ఉదయం 8గంటల సమయంలో గిర్రమ్మబావి సమీపంలోని గృహాల్లో సోదాలు నిర్వహించారు. ఒక ఇంటిలో భారీగా నిల్వ ఉంచిన టపాసులను చూసి అధికారులు అవాక్కయ్యారు. ఇంటి యజమానిని పిలిపించి వాటి గురించి ఆరాతీశారు. తాడిపత్రికి చెందిన ఇద్దరు వ్యక్తులు తరచూ ఇక్కడ టపాసులు నిల్వ ఉంచుకొనే వారని విచారణలో తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి వెంటనే అక్కడ ఉన్న టపాసులను ఒక ఐషర్, నాలుగు చిన్న వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. మూడు వాహనాల్లో సరుకు స్టేషన్‌లో ఉంచగా, మిగిలిన రెండు వాహనాల సరుకును స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రైవేట్ రూంలో ఉంచారు. వీటివిలువ సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల దాకా ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

- కాగా పోలీసులు స్వాధీనం చేసుకున్న టపాసులను వాహనాల్లో తీసుకువచ్చి ప్రైవేట్ రూములో ఉంచడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. సీజ్‌చేసిన చోట నుంచి సురక్షితమైన ప్రాంతానికి తరలించకుండా, నివాస ప్రాంతాల్లో ఎందుకు తీసుకువచ్చి ఉంచారో అని చర్చించుకుంటున్నారు.

రూ.11వేల టపాసులు సీజ్

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలోని ఒక దుకాణంలో సోమవారం రూ.11వేలు విలువగల టపాసులు సీజ్‌చేసినట్లు ఏఎస్ఐ నాగన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేయగా దుకాణంలో విక్రయాలు జరుపుతున్నాడని తెలిసి వాటిని సీజ్ చేశామన్నారు. విక్రయాలు జరుపుతున్న రాజగోపాల్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

70 తులాల వెండి నగల అపహరణ



ఆభరణాలులేని అమ్మవారి విగ్రహం

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొట్టాల గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ పెద్దలు తెలిపిన మేరకు 2024 ఫిబ్రవరిలో పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించి, నూతన విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో అనేక మంది అమ్మవారికి వెండి ఆభరణాలు సమర్పించారన్నారు. వాటిని తరచూ అమ్మవారికి అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే శనివారం కూడా అమ్మవారికి వెండి కిరీటం, వెండి నగలు, ముక్కపుడక, తాళి చైను తదితర ఆభరణాలు అలంకరించి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి వరకూ ఆలయంలో పూజలు, భజనలు నిర్వహించి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. తిరిగి సోమవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు ఆలయానికి వెళ్లగా బయటి వాకిలి(తలుపులు)కి ఉన్న తాళం కనిపించలేదన్నారు. ఇనుప వాకిలి వంగిపోయి, సిమెంట్ పెచ్చులు ఊడిపోవటంతో అనుమానం వచ్చి గుడిలోకి వెళ్లి చూడగా అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం, నగలు దాదాపు 70 తులాలు కనిపించలేదని తెలిపారు. చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చి విడపనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జీడిపల్లిలో 1.681 టీఎంసీల నీరు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో సోమవారం 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1141 క్యూసెక్కులు వుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,101 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అమిలినేని



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల వారు తయారుచేసిన వివిధ రకాల వస్తువుల విక్రయం, అర్బన్ మార్కెట్‌ను ఆయన టీడీపీ పరిశీలకుడు నాగేశ్వరరావుతో కలిసి సోమవారం టీ సర్కిల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకుని చేతివృత్తులు, ఇతర వ్యాపారాలు చేస్తున్న మహిళల వద్ద నాణ్యమైన వస్తువులు ఉంటాయన్నారు. వారి వద్ద వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా వారిని మనం ఆర్థికంగా ఆదుకోవచ్చన్నారు. పార్టీ పరిశీలకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కార్యకర్తల కుటుంబాల ఇబ్బందులు పడకూడదని బీమా అందిస్తున్న పార్టీ టీడీపీ మాత్రమేనన్నారు. సభ్యత్వ నమోదులో కళ్యాణదుర్గం ఐదో స్థానంలో ఉందని, 50 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేసి మొదటి స్థానంలో నిలబడేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

జిల్లా హాకీ జట్టుకు పాల్తూరు విద్యార్థులు

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 14మంది ఎస్‌జీఎఫ్ హాకీ జిల్లా జట్లకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 23న అనంతపురంలో ఎస్‌జీఎఫ్ వారు నిర్వహించిన హాకీ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక అయ్యారన్నారు. అండర్- 17 విభాగంలో పి.నందు, పి.కుమార్ స్వామి, సి.పృథ్వీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో శశికళ, ప్రియాంక, జుబేదా భాను ఎంపికైనట్లు వెల్లడించారు. అండర్-14 విభాగంలో బాలురు వనేష్, సుధీర్, బాలరాజు, మేఘనాథ్, శశికుమార్, బాలికలు బీడీ మల్లిక, మానస, ప్రియాంక ఎంపిక అయ్యారని తెలిపారు. అండర్-17 విభాగంలో హాకీ పోటీలు నవంబరు 3 నుంచి 5వరకూ నెల్లూరులో జరుగుతాయన్నారు. అండర్-14 పోటీలు నవంబరు 8 నుంచి 10 వరకూ అనకాపల్లిలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.



ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థినీవిద్యార్థులు

నిజాయతీగా పనిచేద్దాం: డీఆర్‌ఎం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

గుంతకల్లు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయతీతో పారదర్శకంగా పని చేద్దామని రైల్వే ఉద్యోగులతో డీఆర్‌ఎం విజయకుమార్ ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకుని తన కార్యాలయం బయట సోమవారం ఉదయం ఉద్యోగులను సమావేశపరిచారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, పనిలో పారదర్శకత, అవినీతి రహిత కార్యాచరణ ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జేఏ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైళ్ల భద్రత విషయంగా సకాలంలో స్పందించి అప్రమత్తంగా వ్యవహరించిన నలుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులు ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం జీఎం అరుణ్ కుమార్ జైన్, ఏజీఎం నీరజ్ అగర్వాల్ ఆధ్వర్యంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లోని ఆరు డివిజన్ల అధికారులతో రైళ్ల భద్రతపై ఆన్‌లైన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ వ్యాప్తంగా 15 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. ఇందులో గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని నలుగురు ఉద్యోగులు, సికింద్రాబాద్, విజయవాడ, నాందేడ్ డివిజన్‌లో ముగ్గురు చొప్పున, గుంటూరు డివిజన్‌లో ఇద్దరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో జోన్ పరిధిలోని ఆరు డివిజన్ల డీఆర్‌ఎంలు పాల్గొన్నారు.

మార్పే సమస్యలకు పరిష్కారం


సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ



మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ

అనంతపురం కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మార్చడమే ప్రజా సమస్యలకు అంతిమ పరిష్కారం అని మాజీ ఎమ్మెల్సీ సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో 'లెనినిజం - నేటి సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహిచారు. ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షత వహించగా, ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మరల్చడమే పాలకుల విధానం అన్నారు. ప్రస్తుతం దేశంలో నూతన సంస్కరణల పేరుతో అమలవుతున్న విధానాలు అదానీ, అంబానీ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. దేశంలో కొద్దిమందిగా ఉన్న వారు అత్యధికమంది ప్రజలను కొల్లగొడుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తం గా కార్మికవర్గ వేతనాలు పెరగని పరిస్థితి ఉందన్నారు. లెనినిజం ప్రభా వం ఉత్పన్నమవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్ నిరంకుశం వల్లే వైసీపీని ప్రజలు ఓడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సత్యబోస్, బాషా, డాక్టర్ వీరభద్రయ్య, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, నాగేంద్ర, లెనిన్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు అపుస్మా సాయం



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ వరద బాధితుల సహాయార్థం అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీగా విరాళం అందించారు. అపుస్మా జిల్లా నాయకులు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు కుసుమ పుల్లారెడ్డి, నాయుడు, నాగపీరయ్య ఆ సంఘం ద్వారా అనంతపురం జిల్లా శాఖ తరపున రూ. 10 లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ రాష్ట్ర అసోసియేషన్ తరపున మొత్తం రూ. 75 లక్షల చెక్కును సీఎంకు అందించినట్లు తెలిపారు. తర్వాత రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

వైఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



ఓబుళపతి



గిరిధర్ రెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం కొత్త అధ్యక్షుడు ఓబుళపతి సోమవారం తెలిపారు. రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నూతన కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రాజమోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఓబుళపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిరిధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే అధికార ప్రతినిధిగా రియాజ్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా సురేష్‌కుమార్, గంగిరెడ్డి, వెంకటరెడ్డి, కార్య దర్శులుగా మల్లయ్య, విశ్వనాథరెడ్డి, ఆదినారాయణ స్వామిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. వారంతా రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారని ఆయన ప్రకటించారు.

- ఏసీలు, విలువైన ఫర్నీచర్ మాయం
- బంగ్లాలోనూ అపహరణ
- దొంగలకు సిబ్బంది సహకారం
- ఐదేళ్లూ విచ్చలవిడిగా సామగ్రి కొనుగోలు




కాన్ఫరెన్స్ హాల్‌లో ఏసీలు లేకుండా బోసిపోతున్న దృశ్యం

"జిల్లాలోని అన్నిశాఖల్లోనూ డ్వామా అంటే ప్రత్యేకత ఉంది. అది బలిష్టమైనది. నిధులు వెల్లువలా వస్తుంటాయి. ఆ శాఖలో కీలకమైన పోస్టుల కోసం వేరే శాఖల అధికారులు సైతం డెప్యుటేషన్‌పై ఇక్కడికి వస్తుంటారు. అంతటి కీలకమైన శాఖలో దొంగలు పడ్డారు. బయట వారు కాదు ఇంటి వారే. 'ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు' అంటారు. ఏసీలు, ప్రింటర్లు, ఇతర ఫర్నీచర్ కూడా ఎత్తుకెళ్లారంటే.. ఇంతకన్నా కక్కుర్తి ఉంటుందా..? వీరు అధికారులేనా..?"

ఏమిటీ కక్కుర్తి..!

డ్వామాలో దొంగలు పడ్డారు..

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో కీలకంగా ఉన్న డ్వామాలో దొంగలు పడ్డారు. ఏసీలు, విలువైన సామగ్రి మాయం చేశారు. డ్వామా కాన్ఫరెన్స్‌హాల్‌తో పాటు కార్యాలయం, పీడీ బంగ్లాలో ఉండే ఏసీలు, అత్యంత ఖరీదైన ఫర్నీచర్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. బదిలీ అయిన అధికారులు తమ సిబ్బంది సహకారంతోనే తరలించారని తెలుస్తోంది. ఐదేళ్లలో కొనుగోలు చేసిన సామగ్రికి రూ.90 లక్షల వరకు నిధులు వెచ్చించినట్లు సమాచారం. గత ఐదేళ్లు, అంతకు ముందు కొనుగోలు చేసిన మొత్తం ఏసీలు, ఫర్నీచర్ కనపడలేదు. ఎన్నో సమీక్షలు, సమావేశాలకు వేదికగా నిలిచిన డ్వామా కాన్ఫరెన్స్‌హాల్‌లో ఒక్క ఏసీ కూడా లేకుండా ఎత్తుకెళ్లారు. దీనిపై ఎవరూ నోరు మెదపడం లేదు.

కాన్ఫరెన్స్ హాలులో ఏసీలు మాయం

2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని డ్వామా కాన్ఫరెన్స్‌హాలు ఓ వెలుగు వెలిగింది. జిల్లాకు మంత్రులు, రాష్ట్ర, జాతీయ స్థాయి అధికారులు ఎవరు వచ్చినా డ్వామా కాన్ఫరెన్స్‌హాల్ వేదికగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించేవారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ తరువాత మధ్యాహ్నం నుంచి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక డ్వామా కాన్ఫరెన్స్‌హాలుకు ఉన్న ప్రాధాన్యతను తగ్గిస్తూ వచ్చారు. సమీక్షలు, సమావేశాలన్నీ కలెక్టరేట్‌కే పరిమితం చేశారు. ఈ ఐదేళ్లలో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉన్న ఏసీలు, ఇతర ఫర్నీచర్‌ను మాయం చేశారు. డ్వామా కార్యాలయంలో మొత్తం 8 ఏసీలు, రూ.10లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను బదిలీపై వెళ్లిన అధికారులు తమ వెంట తీసుకెళ్లినట్లు ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. జిల్లా దాటిన, జిల్లా పరిధిలోనే బదిలీ అయిన అధికారులు గుట్టు చప్పుడు కాకుండా సామగ్రిని రాత్రికిరాత్రే తరలించినట్లు సమాచారం. డ్వామా కార్యాలయంతో పాటు పీడీ బంగ్లాలో కూడా ఏసీలు, విలువైన సామగ్రిని ఎత్తుకెళ్ళినట్లు తెలుస్తోంది. బంగ్లాలో ఏ ఒక్క వస్తువును తాకడానికి అధికారులకు అధికారం ఉండదు. బంగ్లాలో అన్ని ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసినవే. బదిలీ అయిన అధికారులు తమ సొంత సామగ్రిని మాత్రమే తీసుకెళ్లాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏసీలు, విలువైన ఫర్నీచర్‌ను తరలించినట్లు ఆశాఖలోనే చెబుతున్నారు. వీటి తరలింపులో సిబ్బంది పాత్ర కీలకంగా ఉందని తెలుస్తోంది.

ఐదేళ్లలో రూ.90 లక్షల సామగ్రి కొనుగోలు

డ్వామాలో గడిచిన ఐదేళ్లలో సుమారు రూ.90లక్షల వరకు వెచ్చించి సామగ్రి కొనుగోలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సామగ్రి కొనుగోలుకంటూ నిధులు డ్రా చేశారు. ఇందులో ఏమేమి కొనుగోలు చేశారనేది ఎవరికీ తెలియదు. అవసరం ఉన్నా, లేకున్నా ఇష్టానుసారంగా కొనుగోలు చేశారు. ఏసీలతో పాటు ఫర్నీచర్, కంప్యూటర్లు, ఫ్యాక్స్ మిషన్లు, ప్రింటర్లను పదికి పైగా కొనుగోలు చేశారు. ప్రస్తుతం నాలుగైదు మాత్రమే డ్వామా కార్యాలయంలో కనిపిస్తున్నాయి. మిగిలినవి మాయం చేసేశారు.

రికార్డులను పరిశీలిస్తున్నాం



డ్వామాలో ఉన్న అన్ని రికార్డులను పరిశీలిస్తున్నాం. ఏసీలతో పాటు ఇతర సామగ్రి వివరాలు తెలుసుకుంటున్నాం. బంగ్లాలో కూడా ఏమేమి వస్తువులు ఉన్నాయి. ఇప్పుడు ఏమేమి కనబడడం లేదో అడిగి తెలుసుకుంటున్నాం. ఐదేళ్లలో ఏమేమి కొనుగోలు చేశారో...ఎంత ఖర్చు పెట్టారో చూడాలి. ఏసీలు, ఇతర ఏ సామగ్రి తరలించలేదని తెలుస్తోంది. అనవసరంగా ఒకరి మీద నింద వేయరాదు. పూర్తి వివరాలు తెలిస్తేనే మాట్లాడాలి. రికార్డులతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీ కూడా పరిశీలిస్తాం. ఒక వేళ తేడా ఉంటే కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

- సలీంబాషా, పీడీ, డ్వామా

డాడీ.. లే.. డాడీ..



నరసింహుడు (ఫైల్), మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె వీణామాధురి

అప్పుల బాధ భరించలేక ముదిగుబ్బకు చెందిన నర్సరీ నిర్వాహకుడు నరసింహుడు (35) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా వేంపల్లికి చెందిన నరసింహుడు పదేళ్ల క్రితం ముదిగుబ్బకు వలస వచ్చాడు. కాశిరెడ్డి నాయన ఆశ్రమ సమీపంలో నర్సరీ ఏర్పాటు చేసుకుని, జీవించేవాడు. గతేడాది నారు అమ్ముడుపోక రూ.4 లక్షలు నష్టపోయాడు. ఈసారి అప్పులు చేసి మళ్లీ నారు వేశాడు. ఈసారి కూడా అదే పరిస్థితి ఎదురైంది. మరో రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. మొత్తంగా అప్పు రూ.8 లక్షలకు చేరింది. ఎలా తీర్చాలోనని మదనపడుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని, మరణించాడు. కాసేపటికి ఇంటికొచ్చిన భార్య సుధ తలుపు తట్టగా తెరవలేదు. స్థానికుల సాయంతో తలుపు బద్దలుకొట్టి చూడగా.. నరసింహులు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో భార్య బోరున విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. నరసింహులుకు ఐదో తరగతి చదువుతున్న కుమార్తె వీణామాధురి, రెండో తరగతి చదువుతున్న కుమారుడు అరుణ్ ఉన్నారు. పాఠశాల నుంచి వచ్చిన కుమార్తె.. తండ్రి నరసింహుడు మృతదేహం పడి రోదించిన తీరు కన్నీరు పెట్టించింది. డాడీ.. లే.. డాడీ.. అంటూ ఆ చిన్నారి తల్లడిల్లింది.

> డాడీ..
> ఆనందంగా బడికి పంపావే..
> ఇందుకేనా..
> మమ్మలను వీడి పోవడానికేనా..
> అనాథలను చేసి.. వెళ్లిపోవడానికేనా..
> అల్లారు ముద్దుగా చూసుకుంది..
> అష్టకష్టాలు పడి పెంచుకుంది..
> ఇందుకేనా..
> అప్పుల సుడిగుండంలో చిక్కిన నువ్వు..
> ప్రాణాలు తీసుకుంటే..
> మేమెలా ఆనందంగా ఉంటామనుకున్నావ్..
> నువ్వేగా మా ధైర్యం..
> నువ్వేగా మా జీవితం..
> నువ్వేగా మా హీరో..
> ఎదురించి.. ఉండుంటే గెలిచేవాడివి..
> మాకు దక్కేవాడివి..
> ఎంత పనిచేశావ్.. డాడీ..
> ప్లీజ్.. లే.. డాడీ..

-ముదిగుబ్బ (ఆంధ్రజ్యోతి)

చేనేతలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చేనేత, జౌళి శాఖ ఆర్డీడీ రాజారావు


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ధర్మవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళిశాఖ తిరుపతి ప్రాంతీయ ఉపసంచాలకుడు (ఆర్డీడీ) రాజారావు సూచించారు. స్థానిక తిక్కస్వామినగర్ వార్డు సచివాలయంలో చేనేత పథకాలపై కార్మికులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ముడిసరుకుపై 5 శాతం జీఎస్టీ రాయితీ, ప్రభుత్వం అందించే త్రిఫ్ట్ ఫండ్, 100 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్‌ఎంఎస్‌ఎస్ పథకం ద్వారా 15 శాతం యార్న్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ముద్ర రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధర్మవరం ప్రాంతంలో చేనేత క్లస్టర్‌ను ఏర్పాటుచేసి, కార్మికులకు జాబ్‌కార్డులు, లిఫ్టింగ్ మిషన్లు తదితర పరికరాలపై 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారన్నారు. వీటిని చేనేతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీ రామకృష్ణ, నేతన్నలు పాల్గొన్నారు.

వైసీపీ బాధితులకు న్యాయం చేయండి

పథకాలు అందేలా చూడండి.. మంత్రి సవితకు పరిటాల శ్రీరామ్ వినతి


మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న పరిటాల శ్రీరామ్, టీడీపీ మండలాల కన్వీనర్లు

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపులతో కూటమి నాయకులు, సానుభూతిపరులకు ప్రభుత్వ పథకాలు అందకుండా చేసిందనీ, దీనిని సరిదిద్ది అర్హులకు న్యాయం చేయాలని చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విన్నవించారు. పెనుకొండలో మంత్రిని సోమవారం శ్రీరామ్ కలిసి, పలు సమస్యలను వివరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో కక్ష సాధింపుల్లో భాగంగా కూటమి సానుభూతిపరులకు సంబంధించిన రేషన్‌కార్డులను ఇష్టారాజ్యంగా తొలగించారనీ, దీంతో బాధితులు.. సంక్షేమ పథకాలకు దూరమయ్యాయన్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. దీంతో అర్హులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారికి అవకాశం కల్పించి, న్యాయం చేయాలని మంత్రి దృష్టికి శ్రీరామ్ తీసుకెళ్లారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన ఎంతోమంది అనర్హులకు తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేశారన్నారు. అలాంటి వాటిని తొలగించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీరామ్ వెంట ధర్మవరం, రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ మండలాల కన్వీనర్లు, ముఖ్య నాయకులు ఉన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

వైద్య విద్యార్థులు విలువలు పాటించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, ఎస్పీ జగదీష్



మెడికోలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్, ఎస్పీ జగదీష్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన వైద్య విద్యను అభ్యసించడం అదృష్టమని, అలాంటి వృత్తిని చేపట్టబోయేవారు ర్యాగింగ్ వంటి చెడు వ్యవహారాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్, ఎస్పీ జగదీష్ అన్నారు. ర్యాగింగ్ నేరానికి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, అందరూ స్నేహంగా మెలగాలని వైద్య విద్యార్థులకు సూచించారు. అనంత వైద్య కళాశాలలో 'ర్యాగింగ్.. దుష్ఫలితాలు' అనే అంశంపై సోమవారం వారు అవగాహన కల్పించారు. సీనియర్, జూనియర్ అనే బేధ భావన సరికాదని అన్నారు. సీనియర్ల పేరిట ర్యాంగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయనిఅన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినవారు జైలు జీవితం అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విలువలు పాటిస్తేనే వైద్య వృత్తిలో గౌరవం దక్కుతుందని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకోవాలని హితవు పలికారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు వారు సూచించారు.

ఇందుకు ప్రిన్సిపాల్ స్పందిస్తూ, కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తోందని అన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ షారోన్ సోనియా తదితరులు పాల్గొన్నారు.

ఏమయ్యావు రామాంజినమ్మా..?

- పశుసంవర్ధక శాఖలో అటెండర్ అదృశ్యం
- పదిరోజుల నుంచి ఆచూకీ తెలియని వైనం
- ప్రాణహాని అంటూ సన్నిహితుల వద్ద ఆవేదన
- ఇంటి వద్ద చెప్పులున్నా, కానరాని మనిషి


రామాంజినమ్మ(ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి రామాంజినమ్మ అదృశ్యం మిస్టరీగా మారింది. ఆమె కుమార్తె అశ్విని ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. పది రోజుల కిందట ఆఫీసు పని వేళలు ముగిసిన తర్వాత ఇంటికి బయల్దేరిన ఆమె ఎక్కడికి వెళ్లినట్లు? ఇంటికే వెళ్లారా? మధ్యలో ఏదైనా జరిగిందా? అనే అనుమానాలు వెంటాడుతున్నాయి.

ఎవరీ రామాంజినమ్మ..?

సోమయ్య ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. దాదాపు 15ఏళ్ల కిందట ఆయన మృతిచెందారు. కారుణ్య నియామకం కింద ఆయన భార్య రామాంజినమ్మకు ఉద్యోగం వచ్చింది. ఆమె పశుసంవర్ధక శాఖ జేడీ ఆఫీస్‌లో అటెండర్‌గా పనిచేస్తోంది. కొడుకు మోహన్‌రావుతో కలిసి నగర శివారులోని లలితానగర్‌లో నివాసముంటోంది. అక్కడి నుంచే ఆమె ప్రతి రోజు ఆఫీస్‌కు వెళ్లి వచ్చేది. కొడుకు మోహన్‌రావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి పెళ్లయింది. కోడలు కర్నూలు జిల్లా పత్తికొండలో ఉంటోంది. కుమార్తె అశ్వినికి కూడా పెళ్లయింది.

ఎలా తెలిసింది...?

రామాంజినమ్మ ఈ నెల 17న పశుసంవర్ధక శాఖకు వెళ్లింది. సాయంత్రం ఇంటికెళ్లిందా..?లేదా అనే విషయంలో స్పష్టత లేదు. ఆమె ఎక్కడికీ వెళ్లదని ఇంటికే వెళ్లి ఉంటుందని బంధువులు చెబుతున్నారు. రామాంజినమ్మ కుమార్తె అశ్విని మరో ఊర్లో నివాసముంటోంది. నాలుగు రోజుల కిందట ఆమె తన తల్లికి ఫోన్ చేసింది. ఎత్తలేదు. ఎన్నిసార్లు చేసినా సమాధానం లేకపోవడంతో తల్లి ఉంటున్న ఇంటికి వచ్చి చూస్తే తాళం వేసి ఉంది. దీంతో తన అన్నకు ఫోన్ చేస్తే హైదరాబాద్‌లో ఉన్నాను...రేపు వస్తానని ఒకసారి, మరోసారి కర్నూలు ఉన్నానని మధ్యాహ్నం వస్తానని చెప్పాడే తప్ప రాలేదు. దీంతో ఆమె మూడు రోజుల కిందట అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మోహన్‌రావును పిలిపించి విచారించారు. ఆమె అదృశ్యమైన రోజు అతడు నగరంలో లేడని తేలింది. పోలీసులు ఇంటికెళ్లి మోహన్‌రావు, అశ్విని సమక్షంలోనే తలుపులు తీయించినట్లు తెలిసింది. ఇంట్లో బీరువా తలుపులు పగలకొట్టి ఉండటం, అందులో ఉండాల్సిన బంగారం నగలు లేకపోవడం, రోకలిబండ ఎరుపు రంగు ఉండటం, సీసీ కెమెరా, సంబంధిత హార్డ్‌డిస్క్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కానీ రామాంజినమ్మ చెప్పులు అక్కడే ఉండి, ఆమె లేకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

వివాదమేంటి..?

రామాంజినమ్మ రుణం తీసుకుని ఇల్లు కట్టుకుంది. దీంతో పాటు ఆమె ఉద్యోగం కోడలికి ఇప్పించాలని కోడలి తరఫువారు ఒత్తిడి తెచ్చేవారనే ఆరోపణలున్నాయి. లేదా ఇంటిని రాయించాలని బలవంతం చేశారని సమాచారం. ఈ క్రమంలో తన కుటుంబసభ్యుల నుంచే ప్రాణహాని ఉందని రామాంజినమ్మ తన సన్నిహితులతో ఆవేదన వ్యక్తం చేసేదని తెలిసింది. మరి రామాంజినమ్మ అదృశ్యం వెనుక ఈ వివాదం ఉందా..?లేక మరో కోణమేమైనా ఉందా..?అనేది తెలియాల్సి ఉంది.

రూరల్ సీఐ శేఖర్ ఏమంటున్నారంటే..

రామాంజినమ్మ అదృశ్యంపై ఫిర్యాదు చేస్తే ఆమె ఉంటున్న ఇంటిని పరిశీలించాం. బీరువా పగలకొట్టి ఉంది. తాళాలు లేక ఆమే పగులకొట్టిందా లేక ఇంకేమైనా ఉందా అనే కోణంలో పరిశీలించాలి. సీసీ ఫుటేజీ విషయంలో స్పష్టత లేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

శతాధిక వృద్ధురాలి మృతి


లక్ష్మీదేవమ్మ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారప్పగారిపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు లక్ష్మీదేవమ్మ (102) సోమవారం మృతిచెందింది. లక్ష్మీదేవమ్మకు నలుగురు చొప్పున కుమారులు, కుమార్తెలు సంతానం. 14 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. 17 మంది మునిమనవళ్లు, మునిమనవరాళ్లు కూడా ఉన్నారు. చనిపోయే ముందు వరకు కూడా లక్ష్మీదేవమ్మ తన పని తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండేదని కుటుంబీకులు, బంధువులు తెలిపారు.

బావిలో పడి బాలుడి మృతి


ప్రసాద్‌నాయక్ (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నున్నపుగుట్ట తండా వద్ద ప్రమాదవశాత్తు బావిలోపడి బాలుడు ప్రసాద్‌నాయక్(16) మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలాజీనాయక్, లక్ష్మీబాయి దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు ప్రసాద్‌నాయక్ పదో తరగతి ఫెయిలై, ఇంటివద్ద ఉండేవాడు. ఆదివారం సాయంత్రం మేకల మేత ఆకుకోసం దగ్గరలో ఉన్న వ్యవసాయ బావి వద్దకెళ్లాడు. అక్కడ ఆకు కోస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈతరాక మునిగి మరణించాడు. చీకటి పడినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. సోమవారం బావివద్ద వెతకగా బాలుడి చెప్పులు కనిపించాయి. బావిలో పడిపోయాడేమోనన్న అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది.. గజ ఈతగాళ్లతో గాలించారు. బాలుడి శవాన్ని బయటకు తీశారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పగలే చోరీ

8 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ

నంబులపూలకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లిలోగల దాదెప్ప ఇంట్లో సోమవారం పగలే దొంగలు పడ్డారు. మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో ఇంటి తలుపు తాళాలు బద్దలు కొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువా తాళాలు పగులకొట్టి అందులోని 8 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరించుకెళ్లినట్లు బాధితుడు ఆవేదన చెందాడు. దాదెప్ప కొత్తగా కొనుగోలు చేసిన గేదె తప్పిపోవడంతో దానిని వెతుక్కుంటూ వెళ్లాడు. అతడి భార్య యశోదమ్మ వ్యవసాయ కూలి పనికెళ్లింది. సాయంత్రం ఆమె పని ముగించుకుని ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా.. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని చూసి చోరీ అయినట్లు గ్రహించింది. పోలీసులకు సమాచారం అందించారు. జమేదార్ ఓబులేసు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


బీరువా తలుపు తెరిచిన దృశ్యం

అప్రమత్తతతోనే ఆనంద దీపావళి

వెలుగుల పండుగ.. కారాదు చీకటి.. టపాసులు కాల్చేటపుడు జాగ్రత్తలు అవసరం


ఎంజీఎం క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాలు

హిందూపురం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): వెలుగులు చిమ్మే పండుగ దీపావళి సమీపించింది. పండుగ రోజున టపాసులు కాల్చుతూ ఇంటిల్లిపాదీ సందడి చేస్తారు. ఆ ఆనందం వెంటే ప్రమాదాలు కూడా పొంచి ఉంటాయి. దీపావళి ఆనందకేళిగా ఉండాలంటే అప్రమత్తత అవసరం. పండగవేళ నిబంధనలు అమలు చేసి, కనీస జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు. టపాసులు విక్రయించే దుకాణాల ఏర్పాటులోనూ నిబంధనలు పాటించాలి. లేదంటే పెను ప్రమాదాలు తప్పవు.

దుకాణ నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

టపాసుల దుకాణాలు పక్కపక్కనే ఏర్పాటు చేస్తే కనీసం 3 మీటర్ల దూరం ఉండాలి. ఎదురెదురుగా ఏర్పాటు చేస్తే 15 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. దుకాణాల్లో ఐఎస్ఐ గుర్తింపు ఉన్న విద్యుత్ సామగ్రినే వినియోగించాలి. 200లీటర్ల నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవాలి. ఫైర్ డ్రై కెమికల్ పౌడర్‌ను అందుబాటులో పెట్టుకోవాలి. పరిసరాల్లో వ్యర్థాలు ఉండకూడదు. దుకాణాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ బాణసంచా పేల్చరాదు. పొగ తాగరాదు. ప్రతి షాపువద్ద తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలి. 18 ఏళ్ల నిండని చిన్నారులను దుకాణంలో పనికి ఉంచుకోరాదు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.

టపాసులు పేల్చే సమయంలో..

అనుమతి పొందిన వ్యాపారుల వద్దే టపాసులు కొనుగోలు చేయాలి. గుర్తింపు కంపెనీలు తయారుచేసిన టపాసులే తీసుకోవాలి. ఎక్కువ రోజులు ఇళ్లలో నిలువ ఉంచుకోరాదు. పెద్దల సమక్షంలోనే పిల్లలు బాణసంచా కాల్చేలా చూడాలి. చేతుల్లో పట్టుకుని కాల్చకూడదు. సగం కాలిన టపాసులను మళ్లీ కాల్చేందుకు ప్రయత్నించకూడదు. నిప్పంటించినా పేలని వాటి వద్దకు వెళ్లి పరిశీలించకూడదు. ఇది ప్రమాదాలకు దారితీస్తుంది. టపాసులు కాల్చేటపుడు బకెట్‌తో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి. పట్టణాల్లో బహుళ అంతస్తులపై బాణసంచా పేల్చరాదు. రాకెట్లువంటి వాటిని గుడిసెలు, పెట్రోల్‌బంక్‌లు, గడ్డివాములకు దూరంగా కాల్చాలి. అలర్జీ, ఉబ్బసం, శ్వాసకోశ సంబంధిత వ్యాధి బాధితులు.. టపాసులకు దూరంగా ఉండాలి. భారీ విస్ఫోటనం వచ్చే టపాసులు మద్యం తాగి చేతులతో కాల్చడం, చిన్నారులకు ఇవ్వడం వంటివి చేయరాదు. శబ్దకాలుష్యం కలిగించే టపాసులు వాడరాదు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదు. వాటిని సమీకరించి, డస్ట్‌బిన్‌లో వేయాలి.

న్యూస్ బాక్స్

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



నిరసనలో పాల్గొన్న ఏజెంట్లు

కదిరి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్లు స్థానిక కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పాలసీదారులకు బోనస్ రేట్లు పెంచాలని, కొత్త పాలసీలపై పెంచిన ప్రీమియం రేట్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏజెంట్లకు తగ్గించిన కమీషన్‌ను గతంలో మాదిరిగా ఇవ్వాలన్నారు. బీమా మొత్తం రూ.లక్షకు తగ్గించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్లు రమణారెడ్డి, వెంకటేష్‌బాబు, రాజారెడ్డి, నారాణరెడ్డి, నగేష్‌బాబు, కోటేశ్వరయ్య, క్రిష్టప్ప, మురళి పాల్గొన్నారు.

అనుమతిలేనిదే లే అవుట్లు వేయకూడదు

నంబులపూలకుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీవారి అనుమతిలేనిదే లేఅవుట్లు వేకూడదని ఈఓఆర్డీ మాధవరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ సమీపంలో వేసిన లేఅవుట్‌న పరిశీలించిన ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా ప్లాట్లు వేస్తే, వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే మండల కేంద్రంలో ప్లాట్లులో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించామన్నారు. ఆయన వెంట కార్యదర్శి ముబారక్, సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణాన్ని తరలించండి

తనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాన్ని మరో ప్రాంతానికి తరలించాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారేసు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడారు. ఇక్కడ మద్య దుకాణం ఉండటంతో కార్యాలయానికి వచ్చే మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ కార్యాలయాలు, బాలికల వసతి గృహం ఈ దారిలోనే ఉన్నాయన్నారు. కావున వెంటనే ఆ దుకాణాన్ని మరో ప్రాంతానికి మార్చాలని కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తప్పిన ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట సర్కిల్‌లో శ్రీనివాస కల్యాణ మండపం సమీపంలో సోమవారం ఉదయం ఓ కారు అదుపుతప్పి.. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. మండలంలోని ఓబుళనాయనిపల్లికి చెందిన నాయుడు తన కుటుంబసభ్యులతో కలిసి కారులో అనంతపురం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. కొత్తపేట సర్కిల్‌లో రాగానే కారు టైరు పేలడంతో ఆ కారు అదుపుతప్పి.. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం.. విద్యుత్ స్తంభం కొంతమేరా వంగి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. కారులో ఉన్నవారికి కూడా గాయాలు కాలేదు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

రక్తదానంపై అవగాహన

బుక్కపట్నం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కళాశాల వైస్ ప్రిన్సిపల్ హరికుమార్, ఎఎస్ఐ మస్తాన్ అవగాహన కల్పించారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం 20 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఓబులేసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆ శాఖ డీఐజీ విజయలక్ష్మీ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎక్కడైనా అసైన్డ్ భూములను పూర్వపు పట్టాగా రిజిస్టర్ చేసినట్టు బయటపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నల్లమాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతు సేవా సహాయకులకు సోమవారం సమాచార హక్కు చట్టంపై ఏడీఏ సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఇందులో ఏఓ సుమతి, ఏఈఓ రంగాచారి, రైతు సేవాకేంద్రం సహాయకులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ఏపీజీఎన్ఏ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నాగమణి



కదిరి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబరుగా పట్నం పీహెచ్‌సీలో పనిచేస్తున్న నాగమణి ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నాగమణి పోటీ చేయగా.. అత్యధిక మెజార్టీతో గెలిచారు. ఆమెను నర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డేను తృతీయ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. ఇటీవల ఎస్కేయూ విడుదల చేసిన సెమిష్టర్ ఫలితాల్లో టాప్‌పస్ట్ సాధించిన విద్యార్థినులను సన్మానించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, కేజీబీవీ అధ్యాపకురాలు హరిణి, మోడల్ కాలేజ్ అధ్యాపకుడు కిరణ్, కళాశాల డైరెక్టర్ జగదీశ్, కరస్పాండెంట్ సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

● పరేషాన్



వైసీపీ పాపం!

రివర్స్ పాలన ఎఫెక్ట్..

- పలు రేషన్ కార్డులు తొలగించిన గత ప్రభుత్వం
- కొత్తవాటి ఊసే లేదాయె
- అర్హత ఉన్నా.. అందని పథకాలు
- కార్డుల కోసం వేలాది మంది నిరీక్షణ
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



రేషన్ కార్డు... ప్రభుత్వ పథకాలకు గ్రీన్ కార్డు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు వర్తిస్థాయి. అయితే గత వైసీపీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం అటుంచి.. ఉన్న కార్డులను లేనిపోని నిబంధనలతో రద్దు చేసింది. అంతేకాకుండా గత వైసీపీ ప్రభుత్వంలో కక్ష సాధింపులతో ఏన్డీఏ సానుభూతిపరుల రేషన్‌కార్డులను ఇష్టానుసారం తొలగించింది. దీంతో అనేక మంది అర్హులు ఆ కార్డులు కోల్పోయి.. ప్రభుత్వ పథకాలు అందక తీవ్రంగా నష్టపోయారు ... పోతున్నారు కూడా. తమకు కార్డులు మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా .. ఫలితం లేకపోయింది. త్వరలో అర్హత గల ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న అర్హుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

కొత్తచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం 2014లో అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హత గల కుటుంబానికి మంజూరు చేసింది. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఐదు రోజుల్లో మంజూరు చేస్తామని గొప్పలు చెప్పింది. తరువాత మరో అడుగు ముందుకేసి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కొత్త రేషన్ కార్డులు రెండున్నర గంటల్లో అందిస్తామని తెలిపింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు.

నిబంధనల పేరుతో తొలగింపు...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేయడం అటుంచి ... ఉన్న కార్డులను పలు నిబంధనల పేరుతో తొలగించింది. 10 ఎకరాలు మెట్ట పొలం, ఐదు ఎకరాలు తడి, ఇన్‌కంట్యాక్సు చెల్లించే వారికి, సొంత కారు ఉన్న వారు అనర్హులుగా తేల్చిచెప్పింది. ఈ కారణాలతో పలు దరఖాస్తులను తొలగించింది. అంతేకాకుండా ఉన్న కార్డులనూ రద్దు చేసింది. కొత్తగా ఇంటి నిర్మాణం కోసం బ్యాంకులో లోన్ తీసుకునేవారు ఐటీ రిటన్స్ అందించాల్సి ఉంటుంది. అలా ఐటీ రిటన్స్ చూపించిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును తొలగించింది.

తొలగింపులు వెంటనే...

వివాహం చేసుకున్న అనంతరం యువతి తన పుట్టింటికి చెందిన రేషన్‌కార్డులో పేరు తొలగించి.. అత్తింటి కార్డులో నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు ఆ యువతి దరఖాస్తు చేసుకుంటే ఆమె పేరును పుట్టింటి కార్డులో మాత్రం వెంటనే తొలగించిన అధికారులు.. అత్తింటి కార్డులో మాత్రం ఎక్కించడం లేదు. అలాగే ఉమ్మడి కుటుంబంలో బైపర్‌గేషన్ అయిన వారు ఉమ్మడి కార్డుల్లో తమ పేర్లను తొలగించి.. కొత్త కార్డు మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కార్డులో వారి పేర్లను మాత్రం వెంటనే తొలగించిన.. అధికారులు వారికి కొత్త కార్డులను మంజూరు చేయలేదు.

కక్ష సాధింపుతో..

గత వైసీపీ ప్రభుత్వంలో కక్ష సాధింపులతో ఏన్డీఏ సానుభూతిపరుల రేషన్‌కార్డులను ఇష్టానుసారం తొలగించింది. పైగా అర్హతలేని వైసీపీ సానుభూతిపరులకు తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేసింది. దీంతో అనేక మంది అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఈ విషయాన్ని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి కూడా తీసుకెళ్లారు. అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కొత్తవి మంజూరు కాక...

కొత్తగా పెళ్లి అయిన వారు, ఉమ్మడి కుటుంబ సభ్యులు బైపర్‌గేషన్ కింద పలురువు రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. నాడు కొత్తకార్డు అడపదడపా మంజూరయ్యాయి. అనంతరం కేవలం కార్డుల్లోని వారి పేర్ల తొలగింపులు (చనిపోయిన వారివి) మాత్రమే చేపట్టారు. దీంతో కొత్తగా పెళ్లయిన వారికి కార్డులు మంజూరు కాక ఇబ్బందులు పడ్డారు. నేటికీ రేషన్ కార్డు కోసం వేచిచూస్తున్నారు.

అర్హత ఉన్నా అందని పథకాలు ..

శ్రీ సత్యసాయి జిల్లాలో 1,367 చౌకధాన్యపు దుకాణాలు ఉండగా 5,72,517 కుటుంబాలకు కార్డులు ఉన్నాయి. మొత్తం 17,24,255 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. రేషన్ కార్డు ఉన్న వారు మాత్రమే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలు అర్హులు. ముఖ్యంగా ఇల్లు, ఆరోగ్య శ్రీ, ఉపాధి హామీ పథకం, పిల్లల చదువుకు, వృద్ధాప్య పింఛన్, రేషన్ సరుకులు... ఇలా పలు పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. అయితే కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో అనేక మంది అర్హులు ప్రభుత్వ పథకాలు అందక తీవ్రంగా నష్టపోయారు. తమకు కార్డులు మంజూరు చేయాలని అధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారు ఆశలు వదుకొని మిన్నకుండిపోయారు.

'కొత్త' ఆశలు..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వారి ఆశలు చిగురించాయి. అంతేకాకుండా అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని కూటమి నాయకులు ప్రకటించడంతో.. అర్హులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలంగా ఉన్న రేషన్‌కార్డు సమస్య తీరబోతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

ఆదేశాలు రాగానే కార్డులిస్తాం

ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. దరకాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రేషన్ కార్డులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లోనే మంజూరు అవుతాయి. ఈ మేరకు త్వరలోనే ప్రభుత్వం ప్రకటించే అవకాశముంది.

-వంశీక్రిష్ణారెడ్డి, డీఎస్ఓ



ధర్మవరంలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ, పారిశుధ్య కార్మికులు



కదిరిలో ఆందోళన చేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల నిరసన

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు సోమవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ... పట్టణంలో జనాభాను బట్టి కార్మిక సంఖ్యను పెంచాలని, చనిపోయిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ఆస్పత్రిని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం జీతాలు అమలు చేయాలని అన్నారు. అదే విధంగా సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కొవిడ్ కార్మికులను అదనపు కార్మికులను ఆప్కాస్‌లోకి చేర్చాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, ముకుంద, ఇంజనీరింగ్ కార్మికులు నాగరాజు, అనిల్, కార్మిక సంఘం నాయకులు లక్ష్మీఓబిలేసు, ప్రసాద్, పెద్దక్క, మంజు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వారిని రెగ్యులర్ చేయాలని, విజయవాడ వరదల సమయంలో అక్కడికెళ్లి పనులు చేసిన కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన బట్టలు, కూలి డబ్బులు ఇవ్వాలని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, మున్సిపల్ నాయకులు జనార్దన్, బాలకృష్ణ, తిరుపాల్, నరసింహమూర్తి, చిన్నక్రిష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి: ఎమ్మెల్యే



కొత్తచెరువులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అధికారులతో ప్రజాదర్బార్- భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు పలు సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారని, వారి సమస్యలను ఆయా శాఖా అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. వాటిని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కొత్తచెరువులో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, బీసీ బాలికల వసతి గృహాన్ని ఖాళీగా ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలోకి మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, ఒలిపి శీన, చికెన్ సెంటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

● పుట్టపర్తి : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డు సచివాలయాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించి విధులకు రాని వారికి సెలవుగా నమోదు చేశారు. మున్సిపాలిటీలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండరాదని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించి సత్యసాయి జయంతి వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, చిత్రావతి పరివాహక ప్రాంతంలో సుందరీకరణ చేయాలని కమిషనర్ ప్రహల్లాద్‌ను ఆదేశించారు.

నైపుణ్య గణన శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణన 2024 జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నైపుణ్య గణనాభివృద్ధి ద్వారా యువత అభివృద్ధికి బాటలు వేద్దామని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో అభివృద్ధి ఉండాలని, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా వృద్ధి చెందాలని అన్నారు. రాగల మార్పులకు అనుగుణంగా యువత తన నైపుణ్యాలను పొంది ఉన్నత స్థానాలను పొందాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరీశ్ పాల్గొన్నారు.

యువత రక్తదానం



రక్తదానం చేసిన యువతతో డీఎస్పీ, సీఐ

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఓడీసీ మండలం నుంచి పలువురు యువకులు తరలివెళ్లారు. సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో 25 మంది యువకులు స్వచ్ఛందంగా ఆ శిబిరంలో రక్తదానం చేసి పలువురికి ఆదర్శనంగా నిలిచారు.

● నేడు కదిరిలో...

తనకల్లు: పోలీసు అమవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం కదిరి పట్టణం పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మండల నుంచి యువత రక్తదాన శిబిరంలో పాల్గొన్నాలన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

ముదిగుబ్బ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంగళమడక, పొడరాళ్లపల్లి, రామస్వామితండా గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

● బత్తలపల్లి : సంజీవపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగు రైతు ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కదిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ అలీబేగ్ తెలిపారు. అతని నుంచి కర్ణాటక మద్యం 90 ఎంఎల్ విస్కీ 11, హైయివాట్స్ 68, 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు అవగాహన

తనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు నైపుణ్య గణనపై అవగాహన కల్పిస్తు న్నట్లు ఎంపీడీఓ రెడ్డెప్ప తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలన్నారు. హాజరుకాని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి

కొత్తచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించిన వారు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని జూనియర్ కళాశాల్లో ప్రారంభిస్తామని చెప్పి.. అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ పథకాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభమైందని 1,3,5 సెమిష్టర్ల పరీక్షా ఫీజులు కట్టాలని యూనివర్సిటీలు విద్యార్థులను వేధిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ నీలకంఠారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రూల్స్ పాటించాలి

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారమే టపాసుల విక్రయించాలని ఆర్డీఓ మహేశ్ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో టపాసుల విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠ శాల క్రీడామైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, దుకాణాల మధ్య మూడు అడుగుల దూరం ఉండాలని అన్నారు. తెచ్చిన టపాసులను పట్టణానికి దూరంగా ప్రత్యేక గోదాములో నిల్వ ఉంచాలన్నారు. ప్రతి లైసెన్స్ దుకాణాదారుడి వద్ద రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారుల అనుమతి తప్పక ఉండాలన్నారు. ధర్మవరంలో ఏడు దుకాణాలు, బత్తలపల్లిలో రెండు, ముదిగుబ్బలో ఏడు, తాడిమర్రిలో ఒకటి, చెన్నేకొత్తపల్లిలో మూడు దుకాణాలకు అనుమతి లభించిందన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, డీఏఓ ఖతిజన్ ఖుబ్రా, తహసీల్దార్లు నటరాజ్, స్వర్ణలత, నారాయణస్వామి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ఫైర్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో టపాసుల దుకాణాలు ఏర్పాట్లను ఆర్డీఓ పరిశీలించారు.

ఘనంగా బాలికా దినోత్సవం

నల్లమాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కస్తూర్బా బాలికలు ఆర్డీటీ ఏరియా కార్యాలయం నుంచి నల్లమాడ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా డైరెక్టర్ రామేశ్వరీ, కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, సీఐ నరేంద్రరెడ్డి మాట్లాడారు. అనంతరం వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏటీఎల్ వన్నూరుస్వామి, ఎస్‌టీఎల్ రాంప్రతాప్‌రెడ్డి, సీఓలు నరసింహులు, గంగప్ప, శ్రీనివాసులు, కుళ్లాయమ్మ, రాజశేఖర్, కస్తూరిబా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి : డీఎస్పీ


రక్తదానం చేస్తున్న డీఎస్పీ

మడకశిరటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత ముందుకు రావాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని యాదవ కల్యాణ మండపం ఆవరణంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మడకశిర నియోజకవర్గం నుంచి 80 మంది రక్తదానం చేశారు. డీఎస్పీ సైతం రక్తదానం చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణతోపాటు సమాజ శ్రేయస్సుకు తమవంతు కృషి చేస్తామన్నారు. సరైన సమయానికి రక్తం అందక అనేక మంది మరణిస్తున్నారని, అందులో కొంత మందినైనా కాపాడిన వారమవుతామన్న ఉద్దేశంతోనే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రామరావు, రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని అప్పగిస్తున్న ఎస్‌ఐ

సోమందేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడు శర్వానంద(4)ను సోమవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకెళితే.. బాలుడు ఇంటి నుంచి ఆడుకుంటూ వచ్చి సోమందేపల్లిలోని లక్ష్మీవెంకటేశ్వర కల్యాణమండపం వద్ద దారి తెలియక ఏడుస్తూ ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే స్థానికులు బాలుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి ఎస్‌ఐకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా బాలుడు తమవద్ద ఉన్నాడన్న సమాచారాన్ని వైరల్ చేశారు. గమనించిన తండ్రి రమేష్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కుమారుడిని అప్పగించాలని కోరారు. ఎస్‌ఐ రమేష్ తండ్రిని మందలిస్తూ పిల్లలపట్ల జాగ్రత్తగా ఉండాలని నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. అనంతరం బాలుడిని వారికి అప్పగించారు.

గత పాలకుల తప్పిదాలే రైతులకు శాపాలు : మంత్రి

సోమందేపల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): గత పాలకులు చేసిన తప్పిదాలు రైతులపాలిట శాపాలుగా మారాయని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం సోమందేపల్లి చెరువు కింద ఉన్న హంద్రీనీవా కాలువను, రైతులు వేసిన పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాలువ నిర్మాణ సమయంలో తమ సమస్యలను ఇటు నాయకులు, అటు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పొలాలకు నీరు అందించాలని కోరినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. పదేళ్లు గడుస్తున్నా తమ కష్టాలు తీరలేదని, పంటలకు నీరందక నష్టపోతున్నామని అన్నారు. స్పందించిన మంత్రి వెంటనే రైతుల పొలాలకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎన్‌ఎస్ఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత పాలకుల తప్పిదాలే రైతులకు శాపంగా మారాయన్నారు. ప్రతి ఎకరాకు హంద్రీనీవా నీరు అందేలా కృషిచేస్తామన్నారు. రైతులు పలు సమస్యలతో కూడిన అర్జీలను ఆమెకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

మడకశిరటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ నాయకుడు నంజుండప్ప అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి వారి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నంజుండప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

హిందదూపురం అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు స్థానిక ఎంజీఎం ఆటల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో చిన్మయ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. సోమవారం క్రీడాకారులను పాఠశాల కరస్పాండెంట్ భీమరాజు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అంశాల్లో కూడా రాణిస్తున్నారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వాల్మీకి బాటలో పయనిద్దాం


వాల్మీకి జయంతిలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

హిందూపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మనమంతా వాల్మీకి మహర్షి బాటలో పయనిద్దామని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం హిందూపురం మండలంలోని వెంకటాపురం, కారూడిపల్లి గ్రామాల్లో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఆనంద్ మాట్లాడుతూ మనమంతా శాంతియుతంగా సన్మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆదినారాయణ, నాయకులు బాబు, రమేష్, నాగరాజు, నాగమ్మ, మురళి, ప్రసన్న పాల్గొన్నారు.

బోరు లారీ సీజ్

పరిగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెంకటాద్రి లేఅవుట్‌లో అక్రమంగా వేస్తున్న బోరు లారీని ఆర్ఐ సిద్దేశ్ సోమవారం సీజ్ చేశారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇక్కడ కొనుగోలు చేసిన భూమిలో ఇంటి అవసరాల కోసం ఎలాంటి అనుమతులు పొందకుండా బోరు వేయిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఆర్ఐ సంఘటనాస్థలానికి చేరుకుని బోరులారీని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి తెలిపారు. సోమవారం గుడిపల్లి వద్ద ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో మౌలిక వసతులు లేవన్నారు. మెడికల్ కిట్, టెంట్ ఏర్పాటు చేయలేదన్నారు. వంద రోజులు పూర్తయిన కూలీలకు గడ్డపారతట్టు ఖర్చులు, 5 కిలోమీటర్ల దూరంలో ఉంటే ఆటో, వాటర్ చార్జీలు చెల్లించడం లేదన్నారు. వారం రోజులు చేసిన పనికి ఒకరోజే మస్టర్‌లో సంతకాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా పనిచేయండి

● అధికారులకు మంత్రి సూచన ● ప్రజాదర్బార్‌కు ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత, బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

గోరంట్ల, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత సూచించారు. సోమవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆమె పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలిరాగా, మంత్రి సవిత, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ వినతులు స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్‌లో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు, రోడ్లు, మురుగునీటి సమస్యలు, రేషన్‌కార్డు, పించన్లకోసం విన్నవించుకున్నారు. గోరంట్లకు చెందిన యువత హుస్సేన్, రోలెక్స్, సల్మాన్‌ఖాన్, నజరుల్లా వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 40వేల నగదు మంత్రికి అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రకుమార్, పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ లక్ష్మీనారాయణ, డీఎల్‌పీఓ శివకుమారి, సీఐ శేఖర్, ఎస్‌ఐలు బాబు, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులున్నారు.

తిరుమలకు బస్సు సర్వీసు ప్రారంభం

పెనుకొండ టౌన్ : తిరుపతికి నూతన బస్సు సర్వీసును బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత ప్రారంభించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో పెనుకొండ - తిరుపతి కొత్త సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులను నడిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు 400 కొత్త బస్సులను కొనుగోలు చేశారని అన్నారు. ఇందులో రెండు బస్సులను పెనుకొండకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, టీడీపీ నాయకులు మాధవనాయుడు, త్రివేంద్ర, రామలింగ, దాదు, షౌకత్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి




హిందూపురంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, పెనుకొండలో విద్యార్థుల ర్యాలీ

హిందూపురం అర్బన్/పెనుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ గతంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే దానిని తొలగించిందన్నారు. ఈ విషయాన్ని లోకేష్ పాదయాత్ర చేపట్టినపుడు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న రీఎంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, పవన్, హుసేన్, హుసేన్, అఫ్రీద్, మూర్తి, అనుదీప్, మంజునాథ్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌ముని, విద్యాసాగర్, హరి, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

రొళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. అందులో వెయ్యికిపైగా ఫిర్యాదులు వచ్చాయి. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అందరి సమస్యలను విన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైఫల్యాల కారణంగానే ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు వస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. అందులో పింఛన్లు, కొత్త ఇళ్లు, తాగునీరు, వన్‌బీ, అడంగల్‌తో పాటు తదితర వాటిపై అర్జీ వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలను దశలవారీగా 15 రోజుల్లోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీఎం పాండురంగప్ప, గురుమూర్తి, రవిభూషణ్, దాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరివిగా పండ్ల మొక్కలు పెంచాలి: ఎమ్మెల్యే

మడకశిరటౌన్: పండ్ల మొక్కలను విరివిగా పెంచాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. పట్టణంలో ఉపాధి హామీ పథకం కింద రైతులకు మంజూరైన మొక్కల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని, తద్వారా పర్యావరణం ఆహ్లాదకరంగా ఉండటంతోపాటు పరిసరాలు పచ్చదనంతో ఉంటాయన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చేసినపుడే సార్థకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మీనారాయణ, ఏపీఓ శ్రీకాంత్, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పావగడకు తుంగభద్ర నీరివ్వాలి


వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర కిసాన్ సంఘం నాయకులు

పావగడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి పావగడకు తాగునీరు అందించాలని రాష్ట్ర కిసాన్ సంఘం అధ్యక్షుడు నాగభూషణరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కిసాన్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నుంచి పావగడకు 2023 సంవత్సరం డిసెంబరులోపు తాగునీరు అందిస్తామని అధికారులు, కాంట్రాక్టర్లు తెలిపినప్పటికీ 10 నెలలు గడిచినా తాగునీటి అందించడంలో విఫలమయ్యారని తెలిపారు. తుంగభద్ర తాగునీటి ప్రాజెక్టు కోసం రూ.2352 కోట్లు నిధులు కేటాయించినా ఇప్పటి వరకు అందించకపోవడం దారుణం అన్నారు. అత్యంత ఫ్లోరైడ్ శాతంతో కూడిన పావగడకు తాగునీరు అందించేందుకు 2011 నుంచి పోరాటాలు చేశామని, హైకోర్టు ద్వారా తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొంచె శివరుద్రప్ప తదితరులు మాట్లాడారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నీటి శాఖ అధికారి బసవలింగప్పకు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని దళితుల ధర్నా


కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దళితులు

పావగడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలంటూ దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తుమకూరు పట్టణంలోని టౌన్‌హాల్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తమటేచళవళి ద్వారా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఉచ్చయ్య మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశించి మూడు నెలలు గడిచినా కర్ణాటక ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణపై నోరు కదపకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని వర్గీకరణ చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీ ముందు పెద్దఎత్తున రాష్ట్రంలోని దళితులంతా కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా : ముగ్గురికి గాయాలు

- క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు





బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, క్షతగాత్రులు

పెనుకొండ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ నుంచి మడకశిరకు వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జివద్ద సోమవారం ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుకొండ నుంచి మడకశిర వైపు వెళ్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి గాయపడిన క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రొద్దం మండలం దందేపల్లికి చెందిన డ్రైవర్ నాగరాజు, దాసప్ప, దేవరాజ్, అజయ్ కలిసి దందేపల్లి నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను వేసుకుని తరలిస్తున్నారు. షీప్‌ఫారం సమీపంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి వద్దకు రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాలీపై కూర్చున్న దాసప్ప, దేవరాజు, అజయ్ తీవ్రంగా గాయపడగా, డ్రైవర్ నాగరాజు సురక్షితంగా బయటపడ్డాడు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు గమనించి క్షతగాత్రులను ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రియల్టర్ల నుంచి కాపాడండి


ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న దళితులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమ రావడంతో యర్రమంచి, దుద్దేబండ, గుట్టూరు తదితర పంచాయతీల్లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ క్రమంలో భూములపై రియల్టర్ల కన్ను పడింది. తమకు రియల్టర్ల నుంచి రక్షణ కల్పించాలని దళితులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో చంద్రగిరి గ్రామానికి చెందిన మాదిగ ఉజ్జారిగాడుకు చెందిన వారసులు ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 450 సర్వే నంబరులో 50.60 ఎకరాల విస్తీర్ణం ఉజ్జారిగాడు పేరుమీద డైక్లాట్ ప్రాపర్టీగా ఉందని, అప్పటి నుంచి ఆ భూమిని అనుభవిస్తూ వస్తున్నామన్నారు. ఈ క్రమంలో చంద్రగిరి గ్రామానికి చెందిన కొందరు రియల్టర్లు, సంబంధంలేని వ్యక్తులు అగ్రిమెంట్ల పేరుతో భూమిలోకి ప్రవేశిస్తున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు గౌరమ్మ, వెంకటలక్ష్మమ్మ, లక్ష్మమ్మ, గోపాల్, ముత్యాలమ్మ తదితరులు కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


మున్సిపాలిటీ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నగర పంచాయతీ మేనేజర్ త్యాగరాజ్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం సీఐటీయూ నాయకులు, కార్మికులు నగర పంచాయతీవద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకుడు రమేష్, రైతు సంఘం నాయకుడు హరి, మండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ పట్టణంలో జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికుల పనిముట్లు, యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నవెంకటేశ్, వెంకటేశ్, నరసింహులు, లక్ష్మీదేవి, నరసమ్మ, చంద్ర పాల్గొన్నారు.

అపార్ నమోదును వేగవంతం చేయండి: ఎంఈఓ


సిద్ధగిరి పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంఈఓ

మడకశిర రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ నమోదు వేగవంతం చేయాలి ఎంఈఓ భాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని గుండుమల కేజీబీవీ, పాపసానిపల్లి, హరేసముద్రం, నీలకంఠాపురం, గురుకుల సిద్ధగిరి పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అపార్ ఐడీ నమోదును పరిశీలించారు. విద్యార్థుల ప్రాథమిక విద్యాదశ నుంచి వివరాలు అడ్మినిస్ట్రేషన్ నందు రిజిస్టర్, ఆధార్ నెంబరు ఒకే విధంగా ఉండేలా సరి చూడాలన్నారు. ఆధార్ కార్డులో తప్పులు ఉంటే సరిచేసుకుని నమోదు చేయాలన్నారు. విద్యార్థుల ఆధార్ కార్డులను తప్పులు సరిచేయడానికి పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఎంపీడీఓతో మాట్లాడి ఆధార్ సెంటర్‌ను ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

అమరాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదును పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మాజీ సర్పంచ్ కుమారస్వామి సోమవారం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5లక్షలు బీమా వర్తిస్తుందని, సహజ మరణం పొందితే రూ.10వేలు తక్షణమే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రప్ప, కృష్ణమూర్తి, తిప్పజ్జ, మంజునాథ్, గౌడరంగప్ప, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీరు అనుకుని.. నూనె తాగి వృద్ధుడి మృతి

గుడిబండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీటీ పల్లికి చెందిన రంగధామప్ప(68) సోమవారం అస్వస్థతతో మృతిచెందినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. రంగధామప్ప మల్బరీ షెడ్డుకు పిచికారి చేసి శుభ్రం చేస్తుండగా దప్పిక కావడంతో బాటిల్‌లో ఉన్న పామాయిల్‌ను నీరు అనుకొని తాగాడు. కడుపులో మంట కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు గుడిబండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.